
# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :315 శుక్రవారం 17-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/










## న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు

2

న్యూజిలాండ్‌లో భూకంపం కలకలం సృష్టించింది. దక్షిణ ద్వీపం సమీపంలోని సముద్ర గర్భంలో 5.9 తీవ్రతతో బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి. తొలుత భూకంప తీవ్రతను 6.3గా అంచనా వేసిన అధికారులు, అనంతరం తాజా విశ్లేషణల ఆధారంగా దాన్ని 5.9గా సవరించారు. భూకంప కేంద్రం తీర ప్రాంతానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. భూకంపం సంభవించిన వెంటనే న్యూజిలాండ్ అధికారులు అప్రమత్తమయ్యారు. దక్షిణ ద్వీపంలోని తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయిసెగర్ పాయింట్ వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే పరిస్థితిని సమీక్షించిన తర్వాత సునామీ ముప్పు స్థాయిని తగ్గించారు. ప్రస్తుతం పెద్దగా ప్రమాదం లేదని భావిస్తున్నప్పటికీ, తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. సముద్రంలో అసాధారణ అలలు, నీటి మట్టంలో మార్పులు కనిపించే అవకాశం ఉందని హెచ్చరించారు.




## శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
- ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
- యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
- ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం

2



## యూపీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

- తెలంగాణ యువతకు ప్రభుత్వం మరో సువర్ణావకాశం
- జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైన వారికి 10 నెలల ఉచిత కోచింగ్‌తో పాటు నెలకు రూ.5 వేల స్టైపెండ్,పుస్తకాల కోసం మరో రూ.5 వేల ఆర్థిక సాయం : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర) పరీక్షలకు సిద్ధమవుతున్న తెలంగాణ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్‌లో ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో అమలవుతున్న ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5 వేల స్టైపెండ్‌తో పాటు పుస్తకాల కొనుగోలుకు ఒకేసారి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు.

-మిగతా 2 లో

# బోనమెత్తిన గోల్కొండ

### జగదాంబమ్మకు తొలి బోనం సమర్పణ

- పట్టువస్త్రాలు అందజేసిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- ఎల్ నినో ప్రభావం తగ్గి తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించాం: మంత్రి కొండా సురేఖ
- సందర్శకులతో కిటకిటలాడిన గోల్కొండ కోట పరిసరాలు
- అలరించిన పోతరాజుల విన్యాసాలు

**హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**

తెలంగాణ జీవన వైవిధ్యానికి, భక్తికి, ఐక్యతకు ప్రతీక అయిన ఆషాఢం బోనాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గోల్కొండ జగదాంబమ్మకు తొలి బోనం సమర్పించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా లంగర్‌హౌస్ నుంచి పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబ మహంకాళి(ఎల్లమ్మ) అమ్మవారికి మంత్రులు పట్టువస్త్రాలు, బంగారు బోనాన్ని సమర్పించారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు,

-మిగతా 2 లో









## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులసమావేశంలో కేటీఆర్

**హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ

-మిగతా 2లో

# సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

### గత ప్రభుత్వ అవకతవకలను సరిదిద్దుతాం

- జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేయడమే లక్ష్యం
- పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు
- బీఆర్ఎస్ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం: భట్టి
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామన్న ప్రచారం అవాస్తవం: ఉత్తమ్
- సీతారామకు 67 టీఎంసీల నీటి అనుమతులు తెచ్చింది కాంగ్రెస్
- ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందిస్తాం: పొంగులేటి
- భూసేకరణకు రూ.135 కోట్లు విడుదలకు నిర్ణయం



**సత్తుపల్లి (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం

-మిగతా 2 లో



## అవినీతి చేస్తే వేటే..

- మంత్రులు, అధికారులకు సీఎం విజయ్ హెచ్చరిక
- లంచాలు, అక్రమాలకు చోటు లేదు..
- ప్రజలకు జవాబుదారీ పాలనే ధ్యేయమన్న తమిళనాడు ముఖ్యమంత్రి
- ఆరోపణలపై సొంత పార్టీ నేతపైనే చర్యలు తీసుకున్న విజయ్
- అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన సీఎం
- లంచం అడిగితే ఎదిరించండి.. ప్రజలకు విజయ్ భరోసా
- తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్పష్టం

**న్యూఢిల్లీ**

తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు.ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్ కావడంతో.. రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా

-మిగతా 2 లో



## నేడు క్యాబినెట్

- పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి ఆమోదం
- చట్ట సవరణతో పాత విధానం పునరుద్ధరణ
- సొంత ఆదాయం నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి
- ట్రెజరీ నిబంధనల్లో మార్పులకు నిర్ణయం
- సెక్షన్ 70(3) సవరణపై మంత్రివర్గ చర్చ
- స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో సమావేశం

**హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**

రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయాలనే కీలకాంశంపై ప్రధానంగా చర్చించనున్నట్టు సమాచారం. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కు సవరణకు సర్కారు సిద్ధమైందని సంబంధింత ఉన్నతా ధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను పంచాయతీ రాజ్ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. దీనికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు వచ్చే అన్ని నిధులను సమీప ప్రభుత్వ ట్రెజరీలోనే

-మిగతా 2లో


## అమెరికా కంటే చైనాకే మొగ్గు..



2

- ప్యూ సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం

## మయన్మార్ తీరంలో ఘోర విషాదం..




- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు

2

# న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు




న్యూఢిల్లీ

న్యూజిలాండ్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై దాని తీవ్రత 5.9 గా నమోదైంది. సౌత్ ఐలాండ్ లోని 'తే అనావ్ ' పట్టణానికి సమీపంలో భూకంపం సంభవించడంతో అధికారులు తొలుత సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఆ హెచ్చరికను కేవలం సునామీ సలహాగా సవరించారు. తే అనావ్ పట్టణానికి ఉత్తరంగా దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ప్రారంభంలో ఈ భూకంప తీవ్రతను 6.3 గా అంచనా వేసిన అధికారులు.. సౌత్ ఐలాండ్ పశ్చిమ తీర ప్రాంతాలైన మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయ్‌సెగర్ పాయింట్ వరకు సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఖచ్చితమైన అంచనాల ఆధారంగా భూకంప తీవ్రతను 5.9గా నిర్ధారించి సునామీ హెచ్చరికను తగ్గించారు. ప్రస్తుతానికి సునామీ ముప్పు లేనప్పటికీ, న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. తీర ప్రాంతాల్లో బలమైన, అసాధారణమైన అలల కదలికలు, అంచనా వేయలేని నీటి ఉప్పెనలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నది. ప్రజలు, పర్యాటకులు సముద్రంలోకి వెళ్లవద్దని, బీచ్‌లకు దూరంగా ఉండాలని సూచించింది.

# యూపీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

(మొదటి తరువాయి)

నిపుణులైన అధ్యాపకుల బృందంతో అన్ని సబ్జెక్టులపై సమగ్ర శిక్షణ అందించి సివిల్స్‌లో విజయం సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు "స్ట్రఎెర్బఎంఎఎఏఅతీఎశ్రీవ.ఎస్త్రస్త్ర.ప్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న "లిలి" తెలంగాణ బోనాలు--చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన"లిలిలో ఏర్పాటు చేసిన బీసీ స్టడీ సర్కిల్ స్టాల్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ప్రచురించిన వార్షిక పుస్తకాలను ప్రముఖులకు అందజేయడంతో పాటు ప్రవేశాల సమాచార బ్రోచర్‌ను విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, లక్ష్యసాధన కోసం పట్టుదలతో సిద్ధం కావాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలమాయాదేవి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
- ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
- యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
- ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం




న్యూఢీల్లి

పరస్పర దాడులు ఉధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒక నల్ల శవపేటికలో పడుకోబెట్టిన భారీ హోర్డింగ్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ప్రధాన ఎంగెలాబ్ స్కేర్‌లో వెలిసింది. కళ్లు మూసుకుని, జుట్టు చెదిరిపోయి పడుకుని ఉన్న ట్రంప్‌ను చూపిస్తున్న ఆ బిల్‌బోర్డుపై మేము ట్రంప్‌ను చంపుతాము అన్న వాక్యాలు రాసి ఉన్నాయి. ఇరాన్ తనపై హత్యాయత్నం చేసే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే ఈ బిల్‌బోర్డు ఏర్పాటు కావడం గమనార్హం.మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని ప్రభుత్వానికి సన్నిహితులైన ఇరాన్ పిడివాదులు పిలుపునిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. యుద్ధం ప్రారంభమైన మొదటిరోజే మరణించిన ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు వారం రోజులపాటు కొనసాగాయి. ఈ సమయంలో అమెరికాపై ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహం స్పష్టంగా కనిపించింది

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

(మొదటి తరువాయి)

ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

# నేడు క్యాబినెట్

(మొదటి తరువాయి)



జమ చేయాలనే నిబంధన ఉంది. దీని వల్ల పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో స్థానిక సంస్థల ఆర్థిక స్వతంత్రతపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో వాటి సొంత ఆదాయంపై విధించిన పరిమితులను తొలగించి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలోనే జమ చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదం తెలపనున్నట్టు సమాచారం.

# బోనమెత్తిన గోల్కొండ

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఆలయ చైర్మెన్ ఆకుల చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి : మంత్రి కొండా సురేఖ

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తొలి(బంగారు) బోనం సమర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1813 సంవత్సరంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలిన సమయంలో ప్రజలు అమ్మవారిని ప్రార్థించగా, వ్యాధి తగ్గుముఖం పట్టిందనీ.. అప్పటి నుంచి ఈ బోనాల ఉత్సవం వైభవంగా కొనసాగుతోందని గుర్తు చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిందని, తెలంగాణను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఐక్యతకు నిదర్శనం బోనాలు

గోల్కొండ బోనాలకు ఘనమైన చరిత్ర ఉందని, ఇవి తెలంగాణ సంస్కృతికి, హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం విషయంలో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జంట నగరాల్లోని అన్ని దేవాలయాల్లోనూ బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను మంజూరు చేశారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

పోతురాజుల విన్యాసాలు

జాతరలో భాగంగా పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను అబ్బురపరిచాయి. వేల సంఖ్యలో జనం తరలిరావడంతో గోల్కొండ కోట జనసంద్రమైంది. శివసత్తుల పూనకాలు, డప్పు దరువులతో కోట పరిసరాలు మారుమోగాయి.

పుస్తకావిష్కరణ -- చెక్కు పంపిణీ

ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన 'బోనాలు' పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానానికి సంబంధించిన చెక్కును ఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, ఆర్డీవో రామకృష్ణ, ఆలయ ఈవో వసంత, తహసిల్దార్ ప్రవీణ్, నయీముద్దీన్, విద్యుత్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్, పోలీస్, ఫైర్, రెవిన్యూ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా కంటే చైనాకే మొగ్గు..

- పూ్య సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం



హైదరాబాద్

భూతల స్వర్గంగా పిలువడే అమెరికాను ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. స్వేచ్ఛా, స్వాతంత్రాలకు పెట్టింది పేరైనా అమెరికాను సందర్శించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. లేటెస్ట్ టెక్నాలజీ, స్వేచ్ఛాయుతమైన జీవనం వంటి పలు కీలక అంశాల్లో ముందుండే యూఎస్‌ని మెజార్టీ ప్రజలు ఇష్టపడుతుంటారు.

కానీ, నేడు పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారిపోయాయి. అమెరికా కంటే చైనానే ఎక్కువ మంది ఇష్టపడున్నారని ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలడం ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాదు ప్రపంచంలో సూపర్ పోలీస్‌గా వెలుగొందుతూ పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కే ఎక్కువ ప్రజాధరణ లభించడం మరో విశేషం.

ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అత్యధిక ప్రజాదరణ..


వివరాల్లోకి వెళ్తే..ప్యూ రీసెర్చ్ సెంటర్ ఇటీవల కొత్తగా నిర్వహించిన తాజా గ్లోబల్ సర్వేలో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కంటే, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది అభిమానాన్ని పొందినట్లు వెల్లడైంది. అమెరికా కేంద్రంగా పనిచేసే ఈ నిష్పక్షపాత సంస్థ వెల్లడించిన ఫలితాల ప్రకారం..36 దేశాల్లో సర్వే చేపట్టగా 25 దేశాల్లోని ప్రజలు అమెరికా కంటే చైనాను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలాగే 22 దేశాలలో షి జిన్‌పింగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే ఎక్కువ ప్రజాదరణ ఉందని తేలింది. అనేక దేశాలలో చైనా పట్ల సానుకూల అభిప్రాయాలు రోజు రోజుకు రికార్డు స్థాయికి పెరుగుతుండగా.. మరోవైపు అమెరికా పట్ల సదాభిప్రాయాలు క్షీణించాయి. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా నాయకుడు షీ జిన్‌పింగ్ ఇద్దరిపైనా ప్రజలు తక్కువ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ ట్రంప్ కంటే జిన్‌పింగే ఎక్కువ స్కోరు సాధించారు. వ్యక్తిగత స్వేచ్ఛలను చైనా కంటే అమెరికానే ఎక్కువగా గౌరవిస్తుందని సర్వేలో పాల్గొన్న ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇతర దేశాల వ్యవహారాలలో అమెరికా కంటే చైనా తక్కువగా జోక్యం చేసుకుంటుందని బలంగా నమ్ముతున్నారు. ప్యూ సంస్థ ఫిబ్రవరి, మే నెలల మధ్య 36 దేశాలలో 42,000 మందికి పైగా ప్రజలను సర్వే చేసి ఈ వివరాలను వెల్లడించింది.

యూరప్ చూపు చైనా వైపు..

చైనా వైపు మొగ్గు చూపిన దేశాలలో స్పెయిన్, ఇండోనేషియా, ఇటలీ, గ్రీస్, కెనడా ఉన్నాయి. కేవలం ఆరు దేశాలు మాత్రమే అమెరికాకు మద్దతుగా నిలిచాయి. వీటిలో చాలా వరకు అమెరికాకు బలమైన మిత్ర దేశాలుగా ఉన్నవే కావడం గమనార్హం. అవి వరుసగా పోలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, భారతదేశం, జపాన్, ఇజ్రాయెల్. అలాగే మరో 20 దేశాలలో అమెరికా పట్ల అనుకూల అభిప్రాయం ఇటీవలి కాలంలో స్థిరంగా తగ్గుతూ వస్తోందని కూడా సర్వేలో తేల్చారు. అదే సమయంలో చైనా పట్ల అనుకూల అభిప్రాయం పెరుగుతూ వస్తోందని కూడా ఆ సంస్థ గుర్తించింది.

# మయన్మార్ తీరంలో ఘోర విషాదం..

- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు



న్యూఢీల్లి

ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరం లో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆ పడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి.ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువ మంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలస సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్టు భావిస్తున్నామని పేర్కొన్నాయి.అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చన్న అంశంపై యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. 2025లో అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో దాదాపు 900 మంది రోహింగ్యా శరణార్థులు అదృశ్యమయ్యారు లేదా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దాంతో ఈ సముద్ర మార్గం ప్రపంచంలోనే వలసదారులు, శరణార్థులకు అత్యంత ప్రమాదకర మార్గంగా మారిందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఐక్యరాజ్యసమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద??దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండో పడవ జూలై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు. సాధారణ నౌకాయాన కాలం ముగిసిన తర్వాత ఈ ప్రయాణాలు జరిగాయని, ఆ సమయంలో సముద్ర పరిస్థితులు సాధారణంగా మరింత ప్రమాదకరంగా ఉంటాయని ప్రకటనలో ఐరాస తెలిపింది. 2026లో కూడా రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులు కలిపి దాదాపు 300 మంది అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో అదృశ్యమైనట్టు సమాచారం అందిందని యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తెలిపాయి.

# సీతారామను పూర్తి చేస్తాం

(మొదటి తరువాయి)

చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు.

లక్షలాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్టులు నిర్వహిం చకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబం ధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యం గా తీసుకోవాలని సూచించారు.

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా--లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీఎస్ఈ యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి చేస్తే వేటే..

(మొదటి తరువాయి)



పతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్.. అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. ఈ క్రమంలో మొన్న కరూర్‌లో ఇటీవల నిర్వహించిన ప్రజాసభలో మాట్లాడుతూ.. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి ఏమాత్రం తావుండబోదని తేల్చిచెప్పారు. 'ఎవరైనా లంచం అడిగితే 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెంటే నేను ఉంటాను. అయినా ఒత్తిడి చేస్తే ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నారని ధైర్యంగా చెప్పండి' అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ఇక అవినీతి నిర్మూలన కోసం విజయ్ ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

## ఢిల్లీలోని ఎర్రకోట తాత్కాలికంగా మూసివేత..! కారణమిదే



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటను జూలై 15 నుండి ఆగస్టు 15 వరకు (నెల రోజులు) మూసి వేయను న్నారు. ఈ నెల 15 నుండి ఆగస్టు 15 వరకు సాధారణ సందర్శకులు, ప్రజల కోసం మూసివేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎర్రకోట వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పాసులు ఉన్న వారినే లోనికి అనుమతిస్తున్నారు. 2026 ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ జాతీయ వేడుకలు ముగిసిన అనంతరం తిరిగి ఎర్రకోటను పర్యాటకుల సందర్శనార్థం తెరుస్తారు.అప్పటి వరకు పర్యాటకులు సహకరించాలని అధికారులు కోరారు. కాగా, ప్రతి సంవత్సరం దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట ప్రధాన వేదికగా నిలుస్తుంది. ఇక్కడే దేశ ప్రధాన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అతిథులు, వేలాది మంది భద్రతా సిబ్బంది, అధికారులు, హాజరవుతారని భావిస్తున్నందున అధికారులు చాలా వారాల ముందు నుండే విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు.

## వాంగ్‌చుక్‌కు అవసరమైన వైద్యసాయం అందించండి.

- కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్య సాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్ ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది.రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈ దీక్ష చేస్తున్నారు. గడిచిన 18 రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరడం, ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. అవసరమైతే ఆయన్ను కాపాడటానికి వైద్య సాయం అందించాలని కేంద్రంతోపాటు ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది.

## పూరీ జగన్నాథ రథయాత్రలో అపశృతి..

**ఒకరి మృతి.. 100 మందికి గాయాలు..!**



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
ఒడిశా లోని పూరీ లో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్ర లో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాటలో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం, కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు.సుమారు 100 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకుపైగా ఆలస్యమైంది.

## మా ప్రయోజనాలకు భంగం కలిగితే ఊరుకోం..

- అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమన్నాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి లో ఇరుదేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. తాజాగా ఇరాన్‌పై రెండో విడత వైమానిక దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో పశ్చిమాసియా లో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా కాలమానం ప్రకారం..గురువారం తెల్లవారుజామున ఈ దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది."హర్మూజ్ జలసంధి గుండా స్వేచ్ఛగా ప్రయాణించే నౌకలకు ముప్పుగా పరిణమించిన ఇరాన్ సైనిక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపాం" అని పేర్కొన్నది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం పూర్తిగా విఫలమైనట్లు స్పష్టమవుతోంది. ఈ దాడులకు ముందు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బేకర్ ఖలీబాఫ్ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు.



హర్మూజ్ జలసంధిలో ఇరానియన్ల ఆధిపత్యాన్ని కొనసాగించడం తమ జాతీయ భద్రతలో భాగమని ఆయన స్పష్టం చేశారు. శత్రువులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించడానికి తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఖలీబాఫ్ చెప్పారు. ఖలీబాఫ్ విడుదల చేసిన ప్రకటనలో అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఇరాన్‌ను దెబ్బతీయడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. యుద్ధం లేదా శాంతి చర్చల సమయంలో ఇరాన్ తన జాతీయ ప్రయోజనాలు, భద్రత, వాస్తవికత, దీర్ఘకాలిక వ్యూహం ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. "మేము యుద్ధాన్ని కోరుకోము. కానీ మా జాతీయ భద్రత, ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉంటాం" అని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు దౌత్యం, చర్చలు సమాంతరంగా కొనసాగాలని ఖలీబాఫ్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జూన్ 18న ఇరాన్, అమెరికా మధ్య లెబనాన్ సహా అన్ని సరిహద్దులలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. 60 రోజుల్లో తుది ఒప్పందంపై చర్చలు జరగాల్సి ఉంది. ఈ ఒప్పందంపై ఖలీబాఫ్ మాట్లాడుతూ.. "ఒప్పందంలోని నిబంధనలను గౌరవించి, అమలు చేసినప్పుడే దానికి అర్థం ఉంటుంది. ఒకవేళ ఈ ఒప్పందం ద్వారా ఇరాన్‌కు ప్రయోజనం కలగనప్పుడు, దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం మాకు లేదు" అని స్పష్టంచేశారు. అయితే గత కొన్ని రోజులుగా ఇరుదేశాల సైనిక బలగాల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో ఈ శాంతి ఒప్పందం ప్రమాదంలో పడింది. తాజాగా అమెరికా రెండో విడత దాడులు నిర్వహించడంతో ఈ ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయినట్లయింది. ఈ పరిణామాలతో హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి.

## వర్షాకాల సమావేశాల్లో ఏడు బిల్లులు

**ఐదు కొత్త బిల్లులు ఆమోదం కోసం జాబితా చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను లోక్‌సభ సెక్రెట రీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. వీటితో ఇప్పటికే లోక్‌సభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులను కూడా ఆమోదించుకునేందుకు జాబితా చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'ను కూడా ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆదాయపన్ను సవరణ బిల్లు (ఆర్డినెన్స్ స్థానంలో), సుప్రీం కోర్టు (న్యాయమూర్తులు సంఖ్య) సవరణ బిల్లు (ఆర్డినెన్స్ స్థానంలో), జనన, మరణాల రిజిస్ట్రేషన్ సవరణ బిల్లు, జాతీయ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, సూక్ష్మ, చిన్న అండ్ మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు వంటి కొత్త బిల్లులను కూడా ఈ సమావేశాల్లో తీసుకురానుంది. సుప్రీంకోర్టు



న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో సవరణలు చేపట్టనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఎంఎస్ఎంఈ రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సవరణలు చేయనుంది. రాష్ట్రాలు సొంతంగా ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. ఆగస్టు 13 తో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

**ఎంపీలకు సరికొత్త మార్గదర్శకాలు**

వర్షాకాల సమావేశాల్లో ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాలను లోక్‌సభ సచివాలయం జారీ చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యాడ్జెట్లనూ అనుమతించరు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపిలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం కోరింది.

## గత 225 ఏళ్లలో.. ఢిల్లీలో 89 శాతం తగ్గిన యమునా నది ప్రవాహం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది ప్రవహిస్తున్న విషయం తెలిసిందే. అయితే గడిచిన రెండు శతాబ్దాల్లో యమునా నది ప్రవాహం, వెడల్పు తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన జియోగ్రఫీ శాఖ, భోపాల్‌లోని సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ దీనిపై ఓ నివేదికను రిలీజ్ చేసింది. ఒకవైపు ఢిల్లీ నగరం విస్తరిస్తుండగా, యమునా నది మాత్రం ఆ సిటీ సమీపంలో క్షీణిస్తున్నట్లు పేర్కొన్నారు. 1799 నాటి మ్యాప్ ఆధారంగా ఈ అంచనా వేశారు. శాటిలైట్ ఇమేజ్‌లు, చారిత్రక రికార్డులను అధ్యయనం చేశారు. గడిచిన 225 ఏళ్లలో యమునా నది ఢిల్లీ సమీపంలో 68 శాతం తన వెడల్పును కోల్పోయిందని, ఇక సిటీకి ఆ నది ద్వారా చేరుతున్న నీరు కూడా 89 శాతం



తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.తాజేవాలా, ఓక్లా, వజీరాబాద్, ఐటీవో వద్ద బ్యారేజీలను నిర్మించడం వల్ల ఢిల్లీ చేరే నీటి సామర్థ్యం తగ్గినట్లు తేల్చారు. మరో వైపు నగరంలో వేగంగా జనాభా పెరగడం కూడా ఓ కారణంగా భావిస్తున్నారు. 19వ శతాబ్దం ఆరంభంలో కేవలం రెండు లక్షలు ఉన్న ఢిల్లీ జనాభా.. ఇప్పుడు 2.15 కోట్లకు చేరుకున్నట్లు స్టడీలో తెలిపారు. దీంతో భూమి, నీటి కోసం ఢిల్లీలో డిమాండ్ పెరిగిపోయిందన్నారు. డెవలప్మెంట్ ప్రాజెక్టుల కోసం కొండల్ని తొవ్వడం వల్ల.. బఫర్ జోన్లుగా ఉండే సుమారు 45 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణ ప్రాంతం ఇప్పుడు నీటి కొరతతో బాధపడుతోంది. యమునా నది మధ్య భాగంలో ఇసుకతో నిండిన ప్రాంతం 1985లో సుమారు 20 చదరపు కిలోమీటర్లు ఉండేదని, కానీ 2020 నాటికి ఆ విస్తీర్ణం 4 చదరపు కిలోమీటర్లకు చేరుకున్నట్లు తెలిపారు. దీని వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడినట్లు రిపోర్టులో చెప్పారు. భవిష్యత్తులో వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడుకోవాలంటే, యమునా నది సహజ ప్రవాహాన్ని పెంచాలన్న అభిప్రాయాన్ని పరిశోధకులు వ్యక్తం చేశారు.

## బాబ్ అల్-మండెబ్ మూసివేత?


**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
ఇప్పటికే హొర్ముజ్ జలసంధి మూసివేతతో చమురు, గ్యాస్ దిగుమతులు నిలిచిపోయి ప్రపంచ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న క్రమంలో అగ్రరాజ్యంపై మరింత ఒత్తిడి పెంచేందుకు ఇరాన్ మరో అనూహ్య




నిర్ణయం తీసుకుంది. ఒక వేళ అమెరికా కనుక ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే ఎర్ర సముద్ర చమురు మార్గాన్ని మూసివేసేందుకు సిద్ధంగా ఉండాలని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులను కోరింది.ఇది ప్రపంచ ఇంధన సరఫరాలకు మరింత తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని మూడు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ పేర్కొంది. ఇప్పటికే ఈ ఆలోచనపై ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వం చర్చలు జరిపి, ఆ సందేశాన్ని హౌతీ మిత్రపక్షాలకు చేరవేర్చిందని రెండు సీనియర్ ఇరాన్ వర్గాలు, ఈ అంశంతో సంబంధం ఉన్న మరో వర్గం వెల్లడించినట్టు రాయిటర్స్ తెలిపింది.

## టీఎంసీ మరో రాజ్యసభ ఎంపీ రాజీనామా

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ) జూలై 16**
తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధి నాయకురాలు మమతా బెనర్జీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన నటి కోయెల్ మల్లిక్ గురువారం తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా



చేశారు. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఢిల్లీలో కలిసిన వెంటనే ఆమె తన రాజీనామాను ప్రకటించారు.నాలుగు నెలల క్రితమే ఆమె ఎంపీగా నామినేట్ అయ్యారు.తన రాజీనామాకు గల కారణాన్నివెల్లడించలేదు. పార్లమెంట్ సమావేశాలు జరగడానికి నాలుగు రోజుల ముందు ఆమె ఈ నిర్ణయం తీసుకోవడం కీలక పరిణామంగా మారింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అఖిలపక్ష ఐక్యగళం

**-జీవో 641ను వెంటనే రద్దు చేయాలి**

**-మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ**

**నిరాహార దీక్ష చేస్తున్న బీజేపీ నాయకుడు**
**-విష్ణువర్ధన్ రెడ్డికి ఎంపీ డీకే అరుణ నిమ్మరసం అందించి దీక్ష విరమణ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ):**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, రైతులు, యువకులు తరలివచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొని ఐక్యంగా పోరాటానికి మద్దతు ప్రకటించారు.
సమావేశం అనంతరం డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ గత ఏడు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డికి ఎంపీ డీకే అరుణ నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేశారు.
ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని, ముందుగా ప్రజలను ఒప్పించి నిర్ణయం తీసుకుంటే అభ్యంతరం ఉండదన్నారు.
హైదరాబాద్ నగరంలోని చెత్తను షాద్‌నగర్ ప్రాంతానికి తరలించడం ఏ మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేసి పోరాటానికి సిద్ధమైన ప్రజలను అభినందించారు.
సిద్దాపూర్ ఒక్క గ్రామ సమస్య కాదని, పది కిలోమీటర్ల పరిధిలో సుమారు 50 గ్రామాల ప్రజలు కాలుష్య ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పార్టీల కంటే ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, పచ్చని వ్యవసాయ భూముల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.
షాద్‌నగర్ ప్రాంతంలో ఇప్పటికే పరిశ్రమల కాలుష్యం అధికంగా ఉందని, రైతులు వ్యవసాయం, పాడిపంటలు, పాలు, పండ్లు, కూరగాయలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి వద్ద సమయం తీసుకుని ప్రజాప్రతినిధులంతా కలిసి వినతిపత్రం అందజేయాలని సూచించారు. తాను కూడా ముఖ్యమంత్రికి లేఖ రాసి సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేస్తానన్నారు. అవసరమైతే ఇందిరా పార్క్ వద్ద ధర్నా, హైదరాబాద్ వరకు పాదయాత్ర వంటి ఉద్యమాల్లో స్వయంగా పాల్గొంటానని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి కూడా లేఖ రాసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సిద్దాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు అధైర్యపడవద్దని, ఐక్యంగా పోరాడితే తప్పకుండా విజయం సాధిస్తామని ధైర్యం చెప్పారు. డంపింగ్ యార్డు ప్రతిపాదన పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

# అమర రాజా బ్యాటరీ సెల్ తయారీ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**మహబూబ్నగర్ , జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :**
మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక అమర రాజా బ్యాటరీ సెల్ తయారీ ప్లాంట్ ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు నేడు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ శ్రీ వీర్లపల్లి శంకర్ గారు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ పెట్టుబడులతో నిర్మితమైన అమర రాజా గిగా కారిడార్ సెల్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బ్యాటరీ తయారీ రంగంలో చైనా గుత్తాధిపత్యానికి తెలంగాణ నుంచే గట్టి పోటీ ఇవ్వనున్నామని, భవిష్యత్ సాంకేతికతకు అవసరమైన ఎనర్జీ స్టోరేజ్ రంగంలో తెలంగాణ కీలక కేంద్రంగా ఎదుగుతుందని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ముఖ్యంగా పాలమూరు యువతకు వేలాది ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారు, శ్రీ వాకిటి శ్రీహరి గారు, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, అమర రాజా బ్యాటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గల్లా జయదేవ్ గారు,స్థానిక ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా శ్రీజగన్నాథ రథయాత్ర

**- హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్ అప్పి, సుదీర్, అశోక్, ఎస్పీ శివ, పినమోని గోపాల్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ లోహాటి, తంగడపల్లి శంకర్, మాజీ జెడ్పీటీసీ సాయికృష్ణ, జయప్రకాష్, మురళి, గంగమణి సత్తయ్య, రవితేజతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. రథయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం రథయాత్రలో భక్తులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళింగ కల్చరల్ కమిటీ నిర్వాహకులను అభినందించారు.

# శ్రీ జగన్నాథ స్వామి రథ యాత్ర లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఆరెకపూడి గాంధీ.

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల నుండి గోపన్ పల్లి వరకు ఇస్కాన్ సైబరాబాద్ హరే రామ హరే కృష్ణ వారి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ జగన్నాథ స్వామి రథ యాత్ర లో ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసినపియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ,,,, ఇస్కాన్ రథ యాత్ర అనేది జగన్నాథ స్వామి, బలరాముడు, సుభద్రల పూజల కోసం నిర్వహించే ఒక వైభవోపేతమైన ఆధ్యాత్మిక ఉత్సవం. ఈ వేడుకల్లో భాగంగా అలంకరించిన భారీ రథాలను భక్తులు వీధుల్లో లాగుతూ భజనలు, సంకీర్తనలు చేస్తారు అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు అద్భుతమైన జగన్నాథ రథయాత్ర పండుగను జరుపుకుంటున్నారు . ఈ పవిత్రమైన రోజున, విశ్వనాథుడు తన ఆలయం నుండి కరుణతో






బయటకు వచ్చి, కుల, మత, లేదా నేపథ్య భేదం లేకుండా ప్రతి ఒక్కరిపై తన ఆశీస్సులను కురిపిస్తాడు అని తెలియచేశారు.రథయాత్ర యొక్క రహస్య హృదయం చాలామందికి రథయాత్ర ఒక గొప్ప రథయాత్రగా కనిపిస్తుంది. అయితే, గౌడీయ వైష్ణవులకు ఇది దైవిక ప్రేమ మరియు విరహం (విప్రలంబ-భావం) యొక్క అత్యున్నత వ్యక్తీకరణకు ప్రతీక. రథాన్ని లాగడం యొక్క ఆధ్యాత్మిక అర్థంజగన్నాథుని రథపు తాళ్లు, భగవంతుడిని మన జీవితాల్లోకి ఆహ్వానించాలనే మన హృదయపూర్వక కోరికకు ప్రతీకగా నిలుస్తాయి. భక్తులు భక్తితో రథాన్ని లాగుతూ, జగన్నాథ స్వామి సమస్త అడ్డంకులను తొలగించి, వారి హృదయాలను పవిత్రపరిచి, కృష్ణ చైతన్యం మరియు ప్రేమపూర్వక భక్తి సేవ ద్వారా వారిలో తనను తాను సుస్థిరంగా స్థాపించుకోవాలని ప్రార్థిస్తారు . భగవంతుడు తన భక్తుల ప్రేమను స్వీకరించడానికి ఎల్లప్పుడూ ఆసక్తిగా ఉంటాడని రథయాత్ర మనకు గుర్తు చేస్తుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, దూబే, అనిల్, ప్రభాకర్ రెడ్డి, మరియు ఇస్కాన్ ప్రతినిధులు తదితరలు పాల్గొనారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డు బాధితులను ఆదుకోవాలి..

**-డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట సమితి**

**చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ**

**- ఎంపీ డీకే అరుణకు వినతి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :**
సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలిపివేసి, బాధిత గ్రామ ప్రజలను ఆదుకోవాలని డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మను కోరారు. గురువారం సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యవహారంపై ఎంపీ డీకే అరుణమ్మ స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ సంబంధిత జీవోను రద్దు చేయించి డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టకుండా మీ వంతు కృషి చేయాలని ఎంపీని ప్రాధేయపడ్డారు. డంపింగ్ యార్డు వల్ల గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయ భూములు తీవ్రంగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ ఎమ్మె సత్యనారాయణతో పాటు రాంబాల్ నాయక్, అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, విషువర్ధన్ రెడ్డి, వడ్డే బాలయ్య, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, మిట్టు నాయక్, లక్ష్మణ్ నాయక్, సున్నాల గణేష్, కదల శ్రీశైలం, కుమ్మరిగూడెం పాండు, సంతోష్ నాయక్, ఎమ్మె మల్లేష్, జామకాయల కృష్ణయ్య, మన్నె లక్ష్మయ్య, ఎమ్మె కృష్ణయ్య, బాబురాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# హక్కింపేట ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులను వెంటనే నియమించాలి

**-అధ్యాపకులు లేక విద్యార్థులకు ఇబ్బందులు**

**-సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజక వర్గంలో లెక్చరర్లు లేకపోవడం సిగ్గుచేటు**

**-హకీమ్ పేట్ జూనియర్ కళాశాల లో లెక్చలర్లను వెంటనే ఏర్పాటు చేయాలని - SFI జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ డిమాండ్**

**-వారం రోజుల్లో అధ్యాపకులను నియమించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తాం**

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 16:-**
కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండల కేంద్రంలోని హకింపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.అనిల్ అన్నారు.గురువారం హకింపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన జూనియర్ కళాశాలను మంజూరు చేసి కళాశాలను ప్రారంభించారన్నారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఎల్ టి,ఎంపిహెచ్ డబ్ల్యు గ్రూప్‌లలో 150 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. అధ్యాపకులు లేకపోవడంతో చదువు ముందుకు సాగక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.విద్యార్థుల చదువు ముందుకు కొనసాగాలంటే అధ్యాపకులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గంలో విద్యార్థులు అధ్యాపకుల కొరత ఉందని రోడ్డు ఎక్కడం విచారకరమన్నారు.ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ చేస్తామని చెప్పి ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి అన్ని విద్యాసంస్థలు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుండి విద్యార్థులు కొడంగల్ కు వచ్చి చదువుకునే విధంగా చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేకపోవడం చూస్తుంటే ఏ స్థాయిలో విద్యార్థులపై ప్రభుత్వానికి ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు.కల్లబొల్లి మాటలు చెప్పి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యం వద్దు

## యువ సంగ్రామ సదస్సు సమీక్ష సమావేశంలో కేటీఆర్‌ను కలిసిన షాద్‌నగర్ యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :** బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన యువ సంగ్రామ సదస్సు సమీక్ష సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను షాద్‌నగర్ నియోజకవర్గ యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువ సంగ్రామ సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు చేసిన కృషి, భవిష్యత్ కార్యాచరణ, యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేసే అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని కేటీఆర్ సూచించినట్లు సమాచారం. అనంతరం మురళీకృష్ణ యాదవ్ కేటీఆర్‌తో కలిసి ఫోటో దిగుతూ ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

## శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవముల సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ ఎస్టేట్స్ లో శ్రీ గంగాధర శాస్త్రి మరియు శ్రీమతి రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవములు సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ రీ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మరియు దోనేపూడి రమాదేవి దంపతులు నిర్వహించిన పూజా కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ముఖ్యంగా దుర్గాసూక్త అభిషేకం, లలితా సహస్రనామ పూర్వక కుంకుమార్చన, రాజశ్యామల అమ్మవారి మూల మంత్ర హోమం , మహా మంగళ నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి వచనం మొదలగు పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా శ్రీ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మరియు దోనేపూడి రమాదేవి దంపతులు రాజశ్యామల యాగ హోమం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ కి మరియు తాజా మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ కి వేద ఆశీర్వాదం అందించారు. వారితో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ రాజ్యశ్యామల యాగ హోమం చేసిన డి ఎస్ ఆర్ కె ప్రసాద్ దంపతులని ఆశీర్వదించారు. అలాగే ఈ నవరాత్రులు నిర్వహించినటువంటి గంగాధర్ శాస్త్రి గారి దంపతులను మరియు వేద పండితులను పియేసి చైర్మన్ గాంధీ సత్కరించడం జరిగినది. పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర గుడ్ల శ్రీనివాస్ యాదవ్ చక్ర పాణి, రావెళ్ల శ్రీనివాస్, గాయత్రి, రాజేశ్వరి, శ్రీమతి వసుమతి, మంజుల, పద్మశ్రీ, లికిత, రాజేశ్వరి, శాంతి, ఈశ్వరి, విజిత, ఎస్ ఆర్ ఎస్టేట్స్ లోని మహిళా మణులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## గచ్చిబౌలిలో PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం గాంధీ మాట్లాడుతూ... ప్రతిష్ఠాత్మకంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ– ఎస్ఐఆర్ లో భాగంగా ప్రతీ ఒక్కరు తమ వివరాలను ఎన్యుమరేషన్ పత్రంలో పూర్తి వివరాలు నింపి , సంతకం చేసి బిఎల్వో లకు అందచేయాలని, ప్రతి ప్రతి దశను స్పష్టంగా తెలుసుకొని సరైన వివరాలతో మీ ఫారమ్‌ను పూర్తి చేయాలని. ఏవైనా సందేహాలుంటే మీ బూత్ లెవల్ ఆఫీసర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలియచేశారు. రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన గొప్ప ప్రజాస్వామ్య దేశం మనది అని, ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు అమూల్యమైనది. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. కావున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన ఓటు ను నమోదు చేసుకోవాలని , చివరి తేదీ ఆగస్ట్ 03 వరకు మాత్రమే నేను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత తో ఓటు హక్కు ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలియచేశారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని,సువర్ణ అవకాశం అని, పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో బారీగా నమోదు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు కానీ ఎన్యుమరేషన్ ఫామ్ లు నింపడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, బీఎల్వో లు బాగా కష్టపడుతున్నారు అని, తక్కువ సమయం ఉండటం వలన, 5 రోజులు లేటు గా ఫామ్స్ రావడం , హై రైజింగ్ బిల్డింగ్, విల్లాస్ , గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాలలోకి బీఎల్వో లను అనుమతివ్వకపోవడం వలన ఇబ్బందికర పరిస్థితులను గమనించడం జరిగినది అని తెలియచేశారు. వీటన్నింటినీ అధిగమించడానికి ఈ వారం రోజులు బాగా కష్టపడి ప్రజల్లోకి విస్తృత అవగాహన పెంచి, ఓటు నమోదు పెంచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని , ఓటు నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, , యువత,కాలనీల అసోసియేషన్ సభ్యులు, గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యులు ,సోషల్ వర్కర్స్ ప్రజాప్రతినిధులు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియచేశారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో గొప్ప ఆయుధం అని, 18 సంవత్సరాలు ప్రతి వయోజనుడు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని , భావి భారత పౌరుడిగా నైతిక హక్కు ఓటు హక్కు అని, అందరూ నమోదు చేసుకోవాల్సిన బాధ్యత ఉంది అని, చాలా ఇండ్లలో ఎన్యుమరేషన్ పత్రాలు నింపిన తరువాత బీఎల్వో కు అందచేయట్లేదు అని, కానీ ఎన్యుమరేషన్ పత్రాలు నింపి సంతకం చేసి బీఎల్వో కి వెనక్కి ఇచ్చినప్పుడు మాత్రమే ఓటు నమోదు అవుతుంది అని, ఇవ్వని వారి ఓటు హక్కు ను కోల్పోవడం జరుగుతుంది అని తెలియచేశారు. అనేక కోణాలలో ఆలోచిస్తే ఓటు హక్కు ను కోల్పోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది అని, అనేక సంక్షేమ పథకాలు కోల్పోయే పరిస్థితి వస్తుంది అని, కళ్యాణ లక్ష్మీ, షాది మూబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి, సబ్సిడీ,లోన్ లు కోల్పోయే పరిస్థితి ఏర్పడితే భవిష్యత్తు అంధకారం అవుతుంది అని, ప్రతి అంశానికి ఆధార్ కార్డ్ ను అడిగినట్టే , భవిష్యత్తు లో ఓటు హక్కు ఏ ప్రాంతంలో ఉంది, ఓటు హక్కు ఉందా అని అడిగే పరిస్థితి వస్తె చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది అని కావున ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఓటు ను నమోదు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ కార్యక్రమం ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కష్టపడాలని, కలెక్టర్ గారు, జోనల్ కమిషన్ నిత్యం టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, అధికారులకు సూచనలు,సలహాలు ఇస్తూ, నిత్యం అందుబాటులో ఉంటున్నారు అని, ప్రతి ఒక్కరు సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అప్పుడే ప్రతి ఒక్కరికి నమోదు అవుతుంది అని, ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకొని భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని , ఓటు నమోదు కు ఆగస్ట్ 3 వ తేదీ చివరి తేదీ అని , బీఎల్వో లు మీ ఇంటికి వచ్చి ఓటు నమోదు చేస్తున్నారు అని, ఎస్ఐఆర్ తర్వాత నమోదు చేసుకుంటామంటే అవకాశం ఉండదు అని, అప్పుడు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి అని, అప్పుడు మీరు అధికారుల చుట్టూ తిరగాలని, రకరకాల పత్రాలు చూపించుకోవాల్సి వస్తుంది అని, ఇప్పుడు పాత ఓటు చూపించి పూర్తి వివరాలు నింపి ఓటు హక్కు ను పొందడం సులభతరం అని తెలియచేశారు. ఎస్ఐఆర్ లో భాగంగా ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తారు అని, ఫామ్ తిరిగి బీఎల్ ఓ కు ఇచ్చినవారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుందని, బీఎల్ ఓలు ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తారని, తిరిగి బీఎల్ఓ నే తీసుకుంటారని, ఇలా ప్రతి ఇంటికి మూడు సార్లు వస్తారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్ లో కుటుంబంలోని ఎవరైనా ఒకరు సంతకం చేయాల్సి ఉంటుందని, లేదంటే ముసాయిదా ఓటరు. జాబితాలో పేరు ఉండదన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్ అక్ నాలెడ్జిమెంట్ కూడా ఇస్తారని తెలిపారు. ఎన్యూమరేషన్ అందజేసేటప్పుడు ఎలాంటి డాక్యుమెంట్స్ ఇవ్వాల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు. ఫామ్ ఇచ్చినవాళ్ల పేరు ముసాయిదా ఓటరు జాబితాలో ఉంటుందని, తర్వాత ఫైనల్ ఓటరు జాబితాలో కూడా ఉంటుందని వివరించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉండనివాళ్లకు సంబంధించిన జాబితాను ఈ ఆ0 ఆఫీసుల వద్ద పబ్లిష్ చేస్తామని చెప్పారు. వారికి ఈఆర్ ద్వారా నోటీసులు జారీచేస్తారని, ఎన్నికల సంఘం గుర్తించిన ఐడీ కార్డులను జతపర్చి అధికారులకు అందజేయాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత ఎన్నికల నమోదు అధికారి/ సహాయక ఎన్నికల నమోదు అధికారి ప్రతిపాదిత ఓటరు అర్హతపై సందేహం కలిగి నోటీసు జారీ చేస్తే సంబంధిత ఓటరు తన అర్హతను నిరూపించుకోవడానికి సహాయక పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఏదైనా కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ) సాధారణ ఉద్యోగి/ పెన్షనర్కు జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు/పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు, 1987కు ముందు భారతదేశంలో ప్రభుత్వం / స్థానిక సంస్థలు/ బ్యాంకులు/తపాలా యం/ఎల్బీసీ/పీఎస్‌యూ ద్వారా జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డ్/సర్టిఫికేట్/పత్రం, పాస్పోర్ట్, గుర్తింపు పొందిన బోర్డులు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/ విద్యా ధృవీకరణ పత్రం, రాష్ట్ర అధికార సంస్థ జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం, అటవీ హక్కుల ధృవీకరణ పత్రం, ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ లేదా ఏదైనా కుల ధృవీకరణ పత్రం, రాష్ట్ర/ స్థానిక అధికారులు జారీ చేసిన కుటుంబ నమోదు పత్రం,

ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి/గృహ కేటాయింపు ధృవీకరణ పత్రాలను పరి గణనలోకి తీసుకుంటారు అని తెలియచేశారు.

## నాగారం,రాంపల్లి పరిధిలోని ప్రజలు
## ఓటర్ ఎన్యుమరేషన్ లో పాల్గొనండి

### మునిసిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి...




**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం మునిసిపాలిటీ, రాంపల్లి వార్డు పరిధిలో నివసిస్తున్న ప్రతి పౌరుడు ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలు ఇప్పటికే అందుకున్న వారు, వాటిని పూర్తిగా మరియు సరైన వివరాలతో నింపి, సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) లేదా మీ పరిధిలోని అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని నాగారం మాజీ మునిసిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి గురువారం కోరారు.

ఇంకా ఎవరికైనా ఎన్యుమరేషన్ ఫారాలు అందకపోయినట్లయితే దయచేసి మీ పరిధిలోని నాగారం లేదా రాంపల్లి వార్డ్ కార్యాలయాన్ని సందర్శించి ఫారం తీసుకుని, దానిని నింపి సంబంధిత అధికారులకు సమర్పించాలని ఆయన కోరారు..ఒకవేళ ఫారం నింపడంలో ఏవైనా సందేహాలు లేదా ఇబ్బందులు ఉన్నట్లయితే, వార్డ్ కార్యాలయంలోని సిబ్బంది మీకు పూర్తి సహాయం అందించి, అవసరమైతే ఫారాన్ని నింపడంలో కూడా సహకరిస్తారన్నారు. అందువల్ల ఎలాంటి సందేహాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు.

వార్డ్ కార్యాలయానికి వచ్చే సమయంలో మీ ఓటర్ ఐడీ కార్డును తప్పనిసరిగా వెంట తీసుకుని రావాలని తెలిపారు. మీ ఓటర్ కార్డులోని వివరాల ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాన్ని సక్రమంగా నింపి సంబంధిత అధికారులకు సమర్పించడం జరుగుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటర్ కార్డును వెంట తీసుకురావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి భారత పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, ఒక గొప్ప బాధ్యత కూడా అని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సమర్పించి, తన ఓటరు నమోదును నిర్ధారించుకోవాలన్నారు. నాగారం మున్సిపాలిటీ మరియు రాంపల్లి వార్డు పరిధిలోని అన్ని కాలనీల ప్రజలకు ఈ సమాచారాన్ని విస్తృతంగా తెలియజేసి, ప్రతి ఇంటికి ఈ సందేశాన్ని చేరేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇవి కేవలం చెత్తతో నిండిన డ్రైనేజీలు కావు...

### - వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం.



**నాగారం, జూలై 16:- (జర్నలిస్ట్ డైరీ)** నాగారం పారిశుద్ధ్య వ్యవస్థ ఎంత నిర్లక్ష్యంగా ఉందో స్పష్టంగా చూపిస్తున్నది ఈ ఫోటో. డ్రైనేజీ కాలువలు చెత్తతో నిండిపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి, దుర్వాసన, దోమలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ప్రమాదం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజల్లో ఒక ప్రశ్న బలంగా వినిపిస్తోంది. ఒకే అధికారి 20--30 సంవత్సరాలకు పైగా అదే ప్రాంతంలో కొనసాగినా, ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధికారుల పనితీరుపై సమీక్ష లేదా, జవాబుదారీతనం లేదా అని, ప్రజలు కోరేది విమర్శలు కాదని అంటున్నారు. వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేసి, పారిశుద్ధ్య వ్యవస్థపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి, అవసరమైతే బాధ్యుల పనితీరును పరిశీలించి తగిన పరిపాలనా చర్యలు తీసుకోవాలని,ప్రజల ఆరోగ్యంతో రాజీ పడొద్దని,పన్నులు కట్టే ప్రజలకు చెత్త కాదని, పరిశుభ్రమైన నాగారం కావాలని ప్రజలు కోరుకుంటారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని కొడంగల్ కౌన్సిలర్ నివాసంలో కప్ప కావిడి పూజలు



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 16:-** వర్షాకాలం ప్రారంభమై ఇన్నాళ్లయినా ఆశించిన రీతిలో వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం కొడంగల్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ స్వగృహంలో గాంధీనగర్ కాలనీ మహిళలు సాంప్రదాయబద్ధంగా కప్ప కావిడి పూజలు చేపట్టారు. ?రోహిణి కార్తె నుంచి ఆరుద్ర కార్తె ముగిసే వరకు కూడా సరైన వర్షాలు పడకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని మహిళలు ఈ సందర్భంగా ప్రార్థించారు. కట్టెకు కోంద్రు కప్పను వేపాకులపై ఉంచి పసుపు కుంకుమలతో అలంకరించి ఇంటింటికి తిప్పారు. ప్రతి ఇంటా మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి కప్పపై పోస్తూ వర్షాలు కురవాలని వేడుకున్నారు. "వానమ్మా వానమ్మా ఒక్కసారి వచ్చిపోవా"అంటూ వరుణ దేవుడిని కీర్తిస్తూ మహిళలు ఆటపాటలతో చేసిన ప్రత్యేక పూజలు కాలనీలో భక్తిభావాన్ని నింపాయి. ఈ సంప్రదాయ వేడుకలో మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్,మిఠాయి రాజేందర్,గాంధీనగర్ కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణుడి కృప కోసం మొక్కులు చెల్లించుకున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# గాంధీ ఆసుపత్రి ఔషధాల కొనుగోళ్లలో అవినీతి ఆరోపణలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

**-ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిని వదిలిపెట్టొద్దు**

**-వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్**

**-రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డిమాండ్..**

**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
గాంధీ ఆసుపత్రిలో స్థానిక కొనుగోళ్ల పేరుతో రూ.7 కోట్ల విలువైన ఔషధాలకు రూ.13 కోట్ల బిల్లులు పెట్టినట్లు వెలుగులోకి వస్తున్న ఆరోపణలు అత్యంత దిగ్భ్రాంతికరమైనవని, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులను కొందరు అవినీతి అధికారుల అడ్డాగా మార్చడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, ఈ ఆరోపణలు నిజమైతే ఇది ప్రజాధనాన్ని దోచుకునే సంఘటనే కాకుండా పేదల ప్రాణాలతో చెలగాటమాడినా నేరమని, ఇటీవల వెలుగులోకి వచ్చిన ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రూపాయి ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ము అన్నారు. ఆ నిధులను పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, కానీ అదే నిధులను కొందరు అవినీతి అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై దోచుకుంటే అది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదని, భారత రాజ్యాంగం కల్పించిన ప్రజల ఆరోగ్య హక్కుపై జరిగిన ప్రత్యక్ష దాడి అని వారు దుయ్యాబట్టారు. ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేవని చెప్పి రోగులను బయట మెడికల్ షాపులకు పంపుతుంటే, మరోవైపు కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం అత్యంత సిగ్గుచేటు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల కొనుగోళ్లు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా పారదర్శక ఈ-టెండర్ విధానంలో జరగాలన్నారు . అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పరిమిత స్థాయిలో లోకల్ పర్చేస్ కు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రతి కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు, బ్యాచ్ నంబర్లు, గడువు తేదీలు, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, విధానం, ఆడిట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు . ఈ నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు కొనుగోళ్లు, తప్పుడు బిల్లులు, నాసిరకం మందుల సరఫరా లేదా అవసరం లేని మందులను కొనుగోలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బాధ్యులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేదల ప్రాణాలను కాపాడే ప్రజా ఆరోగ్య కేంద్రాలని, అలాంటి ఆసుపత్రులను కొందరు అవినీతిపరులు ఆదాయ కేంద్రాలుగా మార్చడం సమాజానికి అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ వ్యవహారంలో ఎవరు ఎంత పెద్ద అధికారి అయినా, ఎంతటి రాజకీయ అండ ఉన్నా వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించాల్సిందేనన్నారు. కేవలం శాఖాపరమైన విచారణలతో కాలయాపన చేయకుండా, హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో స్వతంత్ర న్యాయ విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలన్నారు. అదేవిధంగా, ఈ ఒక్క ఘటనతో సరిపెట్టకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గత ఐదేళ్లుగా జరిగిన ఔషధాల కొనుగోళ్లు, స్థానిక కొనుగోళ్లు, స్టాక్ నిర్వహణ, గడువు ముగిసిన మందుల నిర్వహణపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి నివేదికను బహిరంగంగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు . ప్రజల సొమ్మును దోచుకున్న ప్రతి రూపాయిని బాధ్యుల నుంచే రికవరీ చేయాలన్నారు . పేదల ప్రాణాలు కొందరు అవినీతిపరుల సంపాదనకు బలికావడానికి ఏఐవైఎఫ్ ఎన్నటికీ అంగీకరించదన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి తీవ్ర ప్రజా ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు.

# సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సుకు ఇబ్రహీంపట్నంలో సన్నాహాలు ముమ్మరం...





**ఇబ్రహీంపట్నం. (జులై16) జర్నలిస్ట్ డైరీ**
ఈ నెల 18న సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బిఆర్ఎస్వి) ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజు కుమార్ మాట్లాడుతూ, "యూత్ డిక్లరేషన్" పేరిట విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో యువ సంగ్రామ సదస్సుకు హాజరై తమ హక్కుల కోసం గళమెత్తాలని పిలుపునిచ్చారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 5,000 మంది యువతను సదస్సుకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని యువ సంగ్రామ సదస్సు వేదికగా ఎండగడతామని పేర్కొన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సదస్సుకు నియోజకవర్గంలోని నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర గౌడ్, ప్రసాద్ గౌడ్, అరుణ్ గౌడ్, ఉదయ్ అనిల్, శివ కుమార్, కార్తీక్‌తో పాటు వివిధ కళాశాలల విద్యార్థి నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగారం కాంగ్రెస్ అధ్యక్ష నియామకాన్ని వ్యతిరేకించిన సీనియర్ నాయకులు...



**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్ జిల్లా జిల్లాలోని పలు డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను పీసీసీ నియమించిన నేపథ్యంలో, నాగారం డివిజన్ అధ్యక్షుడిగా ఎలసాని భూమయ్య యాదవ్ నియామకాన్ని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు వ్యతిరేకించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి, తోటకూర వజ్రేష్ యాదవ్‌కు బంధుత్వం ఉన్న కారణంగానే ఎలసాని భూమయ్యకు పదవి కట్టబెట్టారని ఆరోపించారు. దీంతో నిజాయితీగా పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
చిన్నంరాజు సతీష్ గౌడ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నాను. గతంలో మూడు సార్లు పార్టీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నా అవకాశం రాలేదు. కానీ కేవలం బంధుత్వం కారణంగా ఎలసాని భూమయ్య యాదవ్‌కు డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వడం సామాన్య కార్యకర్తలకు తీవ్ర అన్యాయం అని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ 1978 చెన్నారెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నపటి నుండి పార్టీకి పనిచేస్తున్నాము, కనీసం సీనియర్ అని గౌరవం లేకుండా ఇష్టానుసారంగా వజ్రష్ యాదవ్ వ్యవహారిస్తున్నాడని, వజ్రష్ యాదవ్ ను నాగారం మున్సిపల్ కార్యకర్తలు అందరు వ్యతిరేకిస్తున్నారని, రాబోయే రోజులలో నాగారం లో వజ్రష్ ని తిరగనీయం అని తీవ్రంగా హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాసోహం నర్సింగ్ రావు (చిన్న), బాలు యాదవ్, దాసరి రాంరెడ్డి, కిట్టు యాదవ్, సత్యనారాయణ యాదవ్, రవి, పంగ శ్రీహరి, గౌస్, ప్రవీణ్ యాదవ్, రామాగోని శ్రీనివాస్ గౌడ్, మనోహర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాంపల్లిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సర్



**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
రాంపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో
సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకి ఎన్యూమరేషన్ ఫామ్ అందజేసి ఏ విధంగా నింపాలో తెలియజేసి ఫారాలు పూర్తి చేసి బిఎల్ఓల వద్ద డిజిటలైజేషన్ పూర్తి చేసుకోవాలనే విషయాన్ని గురువారం ఇంటింటికీ తిరిగి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మచ్చ శ్రీనివాస్ గౌడ్, గండి అంజయ్య గౌడ్ వరకాల పెంటయ్య గౌడ్, ఏనుగు రామకృష్ణారెడ్డి, గోక యాదగిరి, క్యాసారం అశోక్ గౌడ్, కొండేటి రామ్ రెడ్డి, జమ్మల శ్రీనివాస్ గౌడ్, కొండేటి లక్ష్మారెడ్డి, జంగాల శ్రీనివాసు, బాలగోని ఐలయ్య మీసాల భాస్కర్, నెల్లుట్ల రాకేష్, బందెల పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డును వెంటనే రద్దు చెయ్యాలి.!

**-ప్రజలు జీవించే హక్కును కాపాడాలి.!**

**-పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు..!**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని ప్రజలు జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేస్తు సిద్దాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు స్థలంలో గ్రామస్తులతో పాటు గిరిజనులతో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలు సమావేశమయ్యారు సిద్దాపూర్ పరిసర గ్రామాలను తండాలను సందర్శించి నిజ నిర్ధారణ జరిపారు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఐటి పరిశ్రమల కోసం రైతుల నుండి దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములలో ఐటీ పార్క్ మరియు ఇతర ఉపాధి పరిశ్రమలు కాకుండా ప్రజల జీవితాలను హరించే డంపింగ్ యార్డును ఏకో టౌన్షిప్ పేరుతో ఏర్పాటు చేయాలని జీవో 641 విడుదల చేయడం జరిగిందని ఈ డంపింగ్ ఏర్పాటు చేయడం వల్లనాదాదాపు 7 మండలాలలోని 50 గ్రామాలకు చెందిన ఆరు లక్షల మంది ప్రజలు ప్రత్యక్ష మరియు పరోక్ష ప్రభావానికి గురవుతున్నారని అంతేకాకుండా సిద్దాపూర్ గ్రామంలో ఉండే చెరువులు కలుషితమవుతూ ప్రజలకు వన్య ప్రాణులకు మరియు ప్రకృతి వనరులు మొత్తం కలుషితమయ్యే అవకాశం ఉందని ఈ ప్రాంతం నుండి వ్యవసాయం చేసి హైదరాబాద్ కు కూరగాయలు పాలు ఎగుమతి చేయడం జరుగుతుందని ఈ డంపింగ్ యార్డ్ వల్ల ఆహార పదార్థాలు కూడా పూర్తిగా విషపూరితమయ్యే అవకాశం ఉందని ఇప్పటికే కొత్తూరు ఇండస్ట్రియల్ గా ప్రకటించినందున ఎన్నో కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటుతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భూగర్భ జలాలు ఇప్పటికే కలుషితమయ్యాయని డంపింగ్ యార్డ్ వల్ల గాలి కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు విషపూరితమైయై ఆందోళనలో ప్రజలు ఉన్నారని అత్యంత ప్రమాదమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు మరింత విస్తరించే అవకాశం ఉందని కాబట్టి వెంటనే జీవో 641 ను రద్దు చేసి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు సహాయ కార్యదర్శి తిరుమలయ్య సుభాన్ బాలయ్య రాములు వెంకటేష్ బాలయ్య బస్వరాజ్ ఎల్హెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాలాల్ నాయక్ మిట్టు నాయక్. తదితరులు పాల్గొన్నారు..

# సహకార ఎన్నికలు ప్రభుత్వం తక్షణమే నిర్వహించాలి

**- బిజెపి డిమాండ్...**

**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సహకార సంఘం ఎన్నికలు నిర్వహించకుండానే అడ్డదారుల్లో డైరెక్టర్లు మరియు చైర్మన్ వైస్ చైర్మన్ల నియామకం చేపట్టడం ప్రజాస్వామ్యానికి కూని చేయడమేనని,
కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పరాకాష్టకు చేరుకుందని, తమ స్వంత పార్టీ నాయకులకు అధికారాలు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని బీజేపీ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి డిమాండ్ చేశారు. నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ మీకు ఓడిపోతామని భయంతో ఇలా అక్రమ మార్గం ద్వార పదవులు పొంది అసలైన రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాగారం బీజేపి అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి మామిడి జంగారెడ్డి, బీజేపీ నాయకులు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, టి సూర్యశేఖర్ రెడ్డి, ఆర్ రవీందర్ రెడ్డి, బి సురేందర్ రెడ్డి, యం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యూత్ అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ అధ్వర్యంలో చేరికలు..

**తెలంగాణ రాజ్యాధికార పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతు...**



**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్--మల్కాజిగిరి తెలంగాణ రాజ్యాధికార పార్టీకి రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్, యువజన ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ లు మాట్లాడుతు పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బంగ్లగూడ ఆర్జీ కాలనీకి చెందిన పలువురు నాయకులు గురువారం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీ రాజ్యాధికార సాధనే పార్టీ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్. బాలకృష్ణ, పోతారం శివకుమార్, పోతారం నవీన్ కుమార్, డి. శివ, సీహెచ్. శివాజీ, దర్శనపు ప్రభాకర్, మురళి, బిట్టు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.

# జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ శిరీష

**భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 16 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ శిరీష ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులతో కలిసి రథయాత్రలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.
ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, సీఐ సీతారాం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, కొమ్ము కృష్ణ, చందు నాయక్, సయ్యద్ ఖదీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ లోహాటి, తంగడపల్లి శంకర్, మనీష్, మాధవులు యాదవ్, జయప్రకాష్, గంగమణి సత్తయ్య, రవితేజ, లింగారెడ్డిగూడ అశోక్, జగదీష్, నీరటి వాసుతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. రథయాత్ర సందర్భంగా ఆర్టీసీ కాలనీ పరిసర ప్రాంతాలు భక్తులతో కళకళలాడగా, కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏర్పాట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ జగన్నాథ స్వామి ఆశీస్సులు పొందారు.

## నాగారంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర....



**నాగారం, జూలై 16:-(జర్నలిస్ట్ డైరీ)**
నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పూరి జగన్నాథ్ రథయాత్ర గురువారం వైభవంగా సాగింది. వందలాదిమంది భక్తుల భక్తిపారవశ్యం మధ్య ఆధ్యాత్మిక శోభతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ వార్డ్ సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, రవీందర్ రెడ్డి, రాజు, ప్రభుజీ, అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తా

**-ప్రభుత్వ విప్ వేముల వీరేశం**



**చిట్యాల జూలై 16 (జర్నలిస్ట్ డైరీ)**
చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల చేనేత సహకార సంఘం నూతనంగా ఎన్నికైన పాలకవర్గం గురువారం చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే వేముల వీరేశశీ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాస్ తో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను పాలకవర్గం తమ బాధ్యతగా భావించి ప్రభుత్వ పరంగా వచ్చే సదుపాయాలను కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్మికుల సంక్షేమం సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు. చిట్యాల చేనేత సహకార సంఘ భవన నిర్మాణానికి మొదటి విడతగా రూ.10 లక్షల మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం పాలకవర్గ సభ్యులతో పాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాసు, మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు జెరిపోతుల సత్యనారాయణ కుక్కల మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు ఎద్దులపూరి కృష్ణ, భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు జెల్లా మనోహర్, ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటి మాధవరెడ్డి, దేశపాక రాజేష్ చేనేత సహకార సంఘం పాలకవర్గం.. మిరియాల వెంకటేశ్వర్లు, కోట రాంబాబు, మిర్యాల ప్రకాష్, వడ్డేపల్లి రాములు, మిర్యాల నరేందర్, సంగిశెట్టి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై గోకాఫస్లవాడ్ రైతులకు అవగాహన

**- రైతులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ మల్లమ్మ సూచన**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 16:-**
వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామంలో సర్పంచ్ మల్లమ్మ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోపించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఎల్ నినో కారణంగా రాబోయే రోజుల్లో వర్షపాతంలో లోపం ఏర్పడే ప్రమాదం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ మల్లమ్మ ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఈవో జ్యోతి పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులకు ప్రస్తుత వర్షపాత పరిస్థితి నీటిపారుదల వనరుల లభ్యత బోర్‌వెల్ నీటి పరిస్థితిపై సమగ్రంగా అవగాహన కల్పించారు. తగినంత నీటి వనరులు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే రైతులు పంటలు విత్తాలని సర్పంచ్ మల్లమ్మ అగ్రికల్చర్ ఏఈఓ రైతులకు విజ్ఞప్తి చేశారు.ఎల్ నినో ప్రభావం వల్ల విత్తనాలు లేదా పంటలు దెబ్బతినే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున ముఖ్యంగా లోటు అధిక లోటు వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో తగినంత వర్షపాతం లేదా నీటిపారుదల అందుబాటులో లేకపోతే పంటలు వేయవద్దని స్పష్టంగా సూచించారు.ఒకవేళ రైతులు పంట వేయాలనే పట్టుదలతో ఉంటే తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలను ఎంచుకునేలా మార్గనిర్దేశం చేశారు.ఎల్ నినో ప్రభావాలు పొంచి ఉన్న ప్రమాదాలు వ్యవసాయ శాఖ జారీ చేసిన సూచనలను గ్రామ రైతులు పాటించాలని తద్వారా నష్టాలను నివారించుకోవాలని సర్పంచ్ మల్లమ్మ పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెంటనే ఏకరూప దుస్తులు అందించాలి

**- మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి**
**రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య**



**రామన్నపేట జూలై 16 (జర్నలిస్ట్ డైరీ)**
పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫారాలు) అందించకపోవడం అత్యంత నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇస్కిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు సమయానికి యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, ఇతర అవసరమైన సామగ్రిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రెండు నెలలు పూర్తవుతున్నా విద్యార్థులకు యూనిఫారాలు అందకపోవడం వల్ల తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా మెనూను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, పప్పు, పాలు వంటి పోషకాహార పదార్థాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,వ్యకాస నాయకులు బల్గురి అంజయ్య,రైతు సంఘం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ గన్నెబోయిన విజయభాస్కర్, సీఐటీయు మండల కార్యదర్శి గొరిగే సోములు నాయకులు గంటెపాక శివ కుమార్,మేడబోయిన శ్రీనివాస్,నీల ఐలయ్య,అప్పం సురేందర్, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

# హుషార్ పిట్టలు' నుంచి 'టోంగా.. టోంగా' సాంగ్ రిలీజ్




అన్ను, వాసవి గణేషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు' . పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు.



## హాట్ ఫోటో షూట్‌లతో మతిపోగుడుతోన్న శృతి హాసన్...

# టాక్సిక్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?




కేజీఎఫ్ 2 తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకున్న యశ్ ఇప్పుడు టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడుతూ వస్తోన్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ ఈ సినిమా రిలీజ్ కానుండడం విశేషం. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో ఏకంగా ఐదు గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ యశ్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటివరకు విడుదలైన టీజర్లు, పాటలను బట్టి చూస్తే, ఈ చిత్రంలో చాలా హాట్ సీన్లు, యాక్షన్ సీన్లు ఓ రేంజ్ లో ఉంటాయని స్పష్టమవుతోంది. అయితే ఇందులో బ్రదర్ అండ్ సిస్టర్ సెంటిమెంట్ కూడా ఉందని తెలుస్తోంది. మరి ఇందులో యశ్ చెల్లెలిగా ఎవరు నటిస్తున్నారన్నది ఆసక్తికరంగా మారింది. కొందరేమో లేడీ సూపర్ స్టార్ నయనతార యశ్ కు సిస్టర్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఈ సంగతి పక్కన పెడితే టాక్సిక్ సినిమాలో పలువురు బాలీవుడ్ ముద్దుగుమ్మలు నటిస్తున్నసంగతి తెలిసిందే. కియారా అద్వానీ మెయిన్ హీరోయిన్ అని ఇప్పటికే తెలిసిపోయింది. అలాగే హ్యూమా ఖురేషి, తారా సుతారియా కూడా యశ్ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. అయితే వీరందరి కంటే ముందే ఓ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కు టాక్సిక్ సినిమాలో అవకాశం వచ్చింది. కానీ ఆమె రిజెక్ట్ చేసింది. అలా చేజేతులా గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్న ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు కరీనా కపూర్.హిందీలో స్టార్ హీరోయిన్ గా వెలుగొందుతోన్న కరీనాకు టాక్సిక్ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఏ పాత్ర అనేది తెలియదు కానీ యశ్ తో కరీనా నటిస్తుందని తెగ ప్రచారం జరిగింది. ఒక వేళ ఇదే జరిగి ఉందే కరీనాకు ఇదే మొదటి దక్షిణాది సినిమా అయ్యేది . అలాగే ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయ్యేది. అయితే ఏమైందో తెలియదు కానీ ఉన్నట్లుండి టాక్సిక్ సినిమా నుంచి తప్పుకుంది కరీనా. ఆ తర్వాతా ఆమె ప్లేస్ లోకి లేడీ సూపర్ స్టార్ నయనతార చేరిందని తెలుస్తోంది. ఇక టాక్సిక్ సినిమా విషయానికి వస్తే.. కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ సహా పలువురు విదేశీ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటలకు విశాల్ కూడా సంగీతం అందించారు.

# తమిళంలో బంపరాఫర్



'కాంతార: ఛాప్టర్ 1' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఆమె యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిసింది. రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్- ది డెడ్లీ డాక్టర్'లో ఈ భామ కీలక పాత్రకు ఎంపికైందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కథాగమనంలో ఆమె క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు.'ధర్మన్' చిత్రంలో సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా ఇంపార్టెంట్ రోల్‌లో కనిపించనుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.

# 'ఫౌజీ' వచ్చేది అప్పుడే



రెబెల్ స్టార్ ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ'తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టి-సిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో 'ఫౌజీ' ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్డ్, ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన ఓ యోధుడిలా, రక్తంతో తడిసిన దుస్తులు, శరీరమంతా గాయాలతో, చుట్టూ నేలకూలిన సైనికుల మధ్య తుపాకీని పట్టుకుని నిశ్శబ్దంగా కూర్చున్న ప్రభాస్ లుక్ అదిరిపోయింది. ఆయన లుక్ ఓ యోధుడి త్యాగం, బాధ, ధైర్యం, పట్టుదలను చూపిస్తోంది. పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు. ముఖ్యంగా ఈ పోస్టర్ సినిమాలోని అత్యంత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లలో ఒకదానికి సంబంధించినది. థియేటర్లలో ఈ సీక్వెన్స్ ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఫౌజీ' కేవలం యుద్ధ నేపథ్య చిత్రమే కాకుండా, భావోద్వేగాలతో కూడిన గొప్ప సినీ అనుభూతిని అందించే చిత్రంగా రూపొందుతున్నట్లు పోస్టర్ తెలియజేస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465